

TG/TEL/25/A3731

# నిజం
## దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాదాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ ఎడిటర్: వరుదు సుజాత సంపుటి:-1 సంచిక:-227 పేజీలు:-4 గురువారం 30-07-2026
SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## ఇరాక్‌పై అమెరికా, సౌదీ సంయుక్త దాడులు

- ఇరాక్‌లో ఇరాన్ అనుకూల గ్రూపులపై అమెరికా, సౌదీ అరేబియా వైమానిక దాడులు
- డ్రోన్ దాడులకు ప్రతీకారంగానే ఈ చర్యలని ప్రకటించిన అమెరికా సెంట్రల్ కమాండ్
- ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను విజయవంతంగా అడ్డుకున్న అమెరికా బలగాలు
- పశ్చిమాసియాలో 20కి పైగా అమెరికా యుద్ధ నౌకల మోహరింపు
- దాడులు ఆపకపోతే మరిన్ని సైనిక చర్యలు తప్పవని ఇరాన్‌కు హెచ్చరిక



పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. తమ సైనికులు, సౌదీ అరేబియా ఇంధన వనరులే లక్ష్యంగా ఇరాన్ అనుకూల గ్రూపులు జరిపిన డ్రోన్ దాడులకు ప్రతిగా అమెరికా, సౌదీ అరేబియా బలగాలు సంయుక్త దాడులు చేపట్టాయి. తూర్పు ఇరాక్‌లోని ఇరాన్ మద్దతున్న గ్రూపులకు - మిగతా 2 లో

## 'పీఓకే నిరసనకారులు కూడా భారత్‌లాంటి శత్రువులే'

నోరుపారేసుకున్న పాక్ రక్షణ మంత్రి

- పీఓకే నిరసనకారులపై ఖవాజా ఆసిఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు
- 'భారత్‌లాంటి శత్రువులే' అంటూ నోరుపారేసుకున్న రక్షణ మంత్రి
- పాక్ భద్రతా బలగాల కాల్పుల్లో 32 మంది మృతి
- ఇప్పటివరకు 90 మందికిపైగా మృతి చెందినట్లు నివేదికలు
- ఈ తరుణంలో ఖవాజా వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు



పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలు మరోసారి తీవ్ర వివాదానికి దారితీశాయి. పీఓకేలో నిరసనలు చేపడుతున్న వారిని భారత్‌తో సమానంగా - మిగతా 2 లో

# హైడ్రా కమిషనర్‌ను తప్పించాలన్న హైకోర్టు ఘాటుగా స్పందించిన రేవంత్ రెడ్డి

- హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలన్న హైకోర్టు ఆదేశాలను సమీక్షిస్తామన్న సీఎం
- హైడ్రా అనేది ప్రభుత్వం తెచ్చిన అతిపెద్ద సంస్కరణ అని వెల్లడి
- ఆక్రమణదారులు నకిలీ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ




హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను తక్షణం విధుల నుంచి తప్పించాలంటూ హైకోర్టు వెలువరించిన ఆదేశాలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. ఈ ఉత్తర్వులను సమీక్షిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైడ్రా

## నీటి చుక్క వాడకుండా అత్యధిక ధాన్యం పండించిన తెలంగాణ



- కాళేశ్వరం విషయంలో బీఆర్ఎస్ పార్టీ బూటకపు ప్రచారం చేస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు
- మేడిగడ్డ బ్యారేజ్ నుంచి కన్నెపల్లి పంపు హౌస్‌కు18 కిలోమీటర్ల దూరం ఉందన్నారు
- అన్నారం బ్యారేజ్‌కి రంధ్రాలు ఉన్నాయని CWPRS రిపోర్ట్ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి చుక్క కూడా వాడకుండా భారతదేశంలోనే అత్యధికంగా ధాన్యం పండించిన రాష్ట్రం తెలంగాణ అని - మిగతా 2 లో

## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది



- సింగరేణికే బొగ్గ బ్లాకులు కేటాయించాలనే విన్నపాలను పట్టించుకోవడం లేదన్న కవిత
- టీఎస్ జెన్‌కోను రంగంలోకి దింపడం వెనుక మర్మం ఏమిటని ప్రశ్న
- ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు డ్రామా ఆడుతున్నారని విమర్శ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల తీరు వల్ల తెలంగాణకే - మిగతా 2 లో

## పీఓకేలో రక్తపాతం పాక్ బలగాల దాడిలో 40 మంది మృతి



- పీఓకేలో పాక్ సైన్యం దమనకాండ
- గత రెండు రోజుల్లో 40 మంది పౌరులు మృతి
- ఇది మారణకాండ అంటున్న స్థానిక నేతలు
- జూన్ నుంచి 100 మందికి పైగా హతమయ్యారని ఆరోపణ
- అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని డిమాండ్

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారింది. అక్కడ నిరసనలు - మిగతా 2 లో

# రష్యన్ చౌక ఆయిల్‌పై టారిఫ్‌లు?

అమెరికా బిల్లుతో భారత్‌కు చిక్కులు!

- రష్యాపై కఠిన ఆంక్షల కోసం అమెరికా సెనేట్‌లో కీలక బిల్లు
- రష్యా నుంచి చమురు కొనే దేశాలపై 100 శాతం టారిఫ్‌లకు అవకాశం
- భారీగా రష్యా చమురు కొంటున్న భారత్‌పై తీవ్ర ప్రభావం పడే ఛాన్స్
- ఇంకా చట్టంగా మారని బిల్లు.. తుది నిర్ణయం అధ్యక్షుడిదే
- కొందరు చట్టసభ్యుల నుంచి వ్యతిరేకత.. బిల్లు భవిష్యత్తుపై అనిశ్చితి




రష్యాను ఆర్థికంగా దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా సెనేట్ కీలక అడుగులు వేస్తోంది. ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యాపై కఠిన ఆంక్షలు విధించేందుకు ఉద్దేశించిన ఒక బిల్లుపై ఓటింగ్ జరపనుంది. ఈ బిల్లు చట్టంగా

## రాహుల్ గాంధీ కుటుంబానికి బాబ్రీ మసీదుకు పట్టిన గతే

బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు



- కర్ణాటక ఎమ్మెల్యే యశ్‌పాల్ సువర్ణపై ఎఫ్ఐఆర్ నమోదు
- బాబ్రీ మసీదు ఘటనను ప్రస్తావిస్తూ విమర్శలు
- కాంగ్రెస్ ఫిర్యాదుతో కేసు నమోదు
- వ్యాఖ్యలపై రాజకీయ దుమారం
- కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కుటుంబంపై వివాదాస్పద వ్యాఖ్యలు - మిగతా 2 లో

## ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ పకడ్బందీగా ఉండాలి



- జాబ్ కేలండర్-2026 రెండో దశ ఉద్యోగాల భర్తీకి కొత్త తేదీ ఖరారు
- సెప్టెంబర్ 15న 3,168 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల
- 3, 4 దశల్లోని 5,369 పోస్టులకు అక్టోబర్ 15న ప్రకటన
- ఉద్యోగాల భర్తీలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు ఆదేశం
- మొత్తం 10,060 పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయం

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి న్యాయపరమైన, సాంకేతిక- మిగతా 2 లో

## ఏపీలో యువత ఆగ్రహం కట్టలు తెంచుకుంది



- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్
- అక్రమాలపై సమగ్ర సీబీఐ విచారణ జరిపించాలన్న వైసీపీ
- జిల్లా కేంద్రాల్లో వైసీపీ విద్యార్థి, యువజన విభాగాల నిరసనలు
- ప్రభుత్వం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని జగన్ ఆరోపణ

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ, స్పోర్ట్స్ కోటాలో జరిగిన అన్యాయం యువతలో- మిగతా 2 లో

# రైతులను ఆదుకోండి
# సీఎంకు సీపీఐ రామకృష్ణ వినతి

- ఎల్‌నినో ప్రభావంపై సీఎం చంద్రబాబుతో సీపీఐ రామకృష్ణ భేటీ
- 21 జిల్లాల్లో 54 శాతం వర్షపాత లోటు ఉందని వెల్లడి
- రైతులను ఆదుకుని ప్రత్యామ్నాయ పంటలు అందించాలని వినతి
- ఆగస్టు 3 నుంచి అవగాహన కార్యక్రమాలు చేపడతామన్న సీఎం




ఏపీలో ఎల్‌నినో ప్రభావం వల్ల నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులను తక్షణమే ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కోరారు. ఈ మేరకు

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
గురువారం 30-07-2026

## ఏపీలో యువత ఆగ్రహం కట్టలు తెంచుకుంది

మొదటిపేజీ తరువాయి – వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. వైసీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత, ప్రజలతో కలిసి జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన నిరసన ర్యాలీలు విజయవంతమయ్యాయని జగన్ తెలిపారు. డీఎస్సీ అక్రమాలకు పూర్తి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని యువత బలంగా డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు. పేపర్ లీకేజీ నుంచి స్పోర్ట్స్ కోటా నియామకాల వరకు జరిగిన ప్రతి అక్రమంపై సమగ్ర సీబీఐ విచారణ జరిపించాలని ఆయన కోరారు. చంద్రబాబు ప్రభుత్వం లీకులు, అక్రమాలతో ప్రతిభావంతులైన యువత భవిష్యత్తును అంధకారం చేసిందని, వారిని రోడ్డున పడేసిందని జగన్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు గానీ, మంత్రి లోకేశ్ గానీ నోరు మెదపకుండా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

## రైతులను ఆదుకోండి.. సీఎంకు సీపీఐ రామకృష్ణ వినతి

మొదటిపేజీ తరువాయి – మంగళవారం అమరావతిలోని సచివాలయంలో ఆయన ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను రామకృష్ణ ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 21 జిల్లాల్లో 54 శాతం లోటు వర్షపాతం నమోదైందని, 249 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రామకృష్ణ విన్నపంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు. ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తకుండా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు చెప్పారు. ఆగస్టు 3వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రామకృష్ణ ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది

మొదటిపేజీ తరువాయి – గర్వకారణమైన సింగరేణి సంస్థ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలన్న విజ్ఞప్తులను పట్టించుకోకుండా... మణుగూరు పీకేవోసీపీ (ఖాఖాజా) బొగ్గు బ్లాక్ వేలం నిర్వహించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు. సింగరేణి నేరుగా వేలంలో పాల్గొంటుందని పైకి ప్రకటించిన ప్రభుత్వం, తెరవెనుక మాత్రం టీఎస్ జెన్‌కోను పోటీలోకి తెచ్చేలా కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తోందని కవిత మండిపడ్డారు. బొగ్గు తవ్వకాల్లో శతాబ్దాల అనుభవం, ప్రావీణ్యం ఉన్న సింగరేణి సంస్థకు పోటీగా.. ఎలాంటి అనుభవం లేని టీఎస్ జెన్‌కోను రేసులోకి దింపడం వెనుక ఉన్న మర్మమేమిటో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జెన్‌కో ద్వారా బొగ్గు బ్లాకులను దక్కించుకుని, ఆ తర్వాత అనుభవం లేదనే నెపంతో వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఈ ముసుగు డ్రామా ఆడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. సింగరేణి భవిష్యత్తు, అభివృద్ధిపై కిషన్ రెడ్డికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా నేరుగా కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ వేలం పోటీ నుంచి టీఎస్ జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం తప్పించాలని డిమాండ్ చేశారు.


## ఇరాక్‌పై అమెరికా, సౌదీ సంయుక్త దాడులు

మొదటిపేజీ తరువాయి – చెందిన స్థావరాలపై మంగళవారం వైమానిక దాడులు జరిపినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ఒక ప్రకటనలో తెలిపింది. గత 72 గంటల్లో ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఆదేశాలతో 30కి పైగా డ్రోన్ దాడులు జరిగాయని, వాటికి బదులుగానే ఈ ఆపరేషన్ చేపట్టామని సెంట్‌కామ్ పేర్కొంది. అమెరికా, సౌదీ యుద్ధ విమానాలు ఈ దాడుల్లో పాల్గొన్నాయని, ఇరాన్ అనుకూల గ్రూపులు ఆయుధాలను నిల్వ ఉంచే ప్రదేశాలు, లాజిస్టిక్స్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నామని వివరించింది. అయితే, ఈ దాడుల్లో జరిగిన నష్టం లేదా ప్రాణనష్టం వివరాలను సెంట్‌కామ్ వెల్లడించలేదు. ఇదే సమయంలో, పశ్చిమాసియాలోని అమెరికా బలగాలపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో దాడికి యత్నించిందని సెంట్‌కామ్ వెల్లడించింది. ఇరాన్ నుంచి ప్రయోగించిన అన్ని క్షిపణులను తమ రక్షణ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయని, తమ బలగాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయని స్పష్టం చేసింది. 2026 ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ మధ్య కాలంలో ఇరాన్ అనుకూల గ్రూపులు అమెరికా పౌరులు, ఆస్తులపై 600కు పైగా దాడులకు ప్రయత్నించాయని సెంట్‌కామ్ గుర్తుచేసింది. "ఐఆర్‌జీసీ, దాని ఉగ్రవాద ప్రాక్సీ గ్రూపులు ఈ దాడులను వెంటనే నిలిపివేయాలి, లేదంటే అమెరికా సైన్యం నుంచి మరిన్ని ప్రతిస్పందనలు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని హెచ్చరించింది. మరోవైపు, మధ్యప్రాచ్యంలో 20కి పైగా అమెరికా యుద్ధనౌకలు సైనిక కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నాయని సెంట్‌కామ్ తెలిపింది. ఇరాన్‌పై 'స్టీల్ వాల్ దిగ్బంధం'ను కఠినంగా అమలు చేస్తున్నట్లు, ఇందులో భాగంగా జులై 28 నాటికి 18 వాణిజ్య నౌకలను దారి మళ్లించినట్లు పేర్కొంది.

## రష్యన్ చౌక ఆయిల్‌పై టారిఫ్‌లు?

మొదటిపేజీ తరువాయి – మారితే, రష్యా నుంచి చౌకగా ముడి చమురును భారీగా కొనుగోలు చేస్తున్న భారత్ వంటి దేశాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ వెల్లడించింది. ఈ బిల్లు ప్రకారం, రష్యా నుంచి పెద్దమొత్తంలో చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లభిస్తుంది. ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగిస్తున్న రష్యాకు ప్రధాన ఆదాయ వనరైన ఇంధన విక్రయాలను అడ్డుకోవడమే దీని ముఖ్య ఉద్దేశం. ఈ జాబితాలో భారత్, చైనా, జపాన్‌తో పాటు కొన్ని ఐరోపా దేశాలు కూడా ఉన్నాయి. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి భారత్.. రష్యా నుంచి రాయితీ ధరలకు అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్న దేశాల్లో ఒకటిగా నిలిచింది. ఈ బిల్లుకు 'లిండ్సే ఓ.గ్రాహమ్ సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026' అని పేరు పెట్టారు. ఇది కేవలం రష్యానే కాకుండా, ఇరాన్‌ను కూడా లక్ష్యంగా చేసుకుంది. అమెరికా కాంగ్రెస్‌లో ఉక్రెయిన్‌కు గట్టి మద్దతుదారుగా నిలిచిన దివంగత సెనేటర్ లిండ్సే గ్రాహం అంత్యక్రియలు జరుగుతున్న రోజే ఈ ఓటింగ్ జరగడం గమనార్హం. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వాషింగ్టన్‌లో పర్యటిస్తున్నారు. అయితే, ఈ బిల్లు చట్టంగా మారడానికి ఇంకా చాలా సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం సెనేట్‌లో జరుగుతున్నది కేవలం ఒక ప్రక్రియపరమైన ఓటింగ్ మాత్రమే. ఇది సెనేట్‌తో పాటు ప్రతినిధుల సభలోనూ ఆమోదం పొందిన తర్వాతే అధ్యక్షుడు ట్రంప్ వద్దకు వెళ్తుంది. ఒకవేళ చట్టంగా మారినా, టారిఫ్‌ల విధింపు వెంటనే జరగదు. వాటిని ఎప్పుడు, ఎవరిపై విధించాలనే విచక్షణాధికారం అధ్యక్షుడికే ఉంటుంది. ఈ బిల్లుకు ఇరాన్‌పై ఆంక్షలను జోడించడంతో అధ్యక్షుడు ట్రంప్ మద్దతు తెలిపారు. కానీ, కొందరు డెమోక్రటిక్ చట్టసభ్యులు దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని రాయిటర్స్ పేర్కొంది. ఈ బిల్లు అధ్యక్షుడికి అపరిమిత టారిఫ్ అధికారాలను కట్టబెడుతుందని, ఇది మిత్రదేశాలను సైతం ప్రభావితం చేయవచ్చని, అమెరికా వినియోగదారులపై భారం పడుతుందని వారు వాదిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ బిల్లు ప్రాథమిక దశలోనే ఉంది. దీని భవిష్యత్తు ప్రభావం కాంగ్రెస్ ఆమోదం, అమెరికా ప్రభుత్వ నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.

## 'పీఓకే నిరసనకారులు కూడా భారత్‌లాంటి శత్రువులే'



మొదటిపేజీ తరువాయి – శత్రువులుగా చూస్తానంటూ నోరు పారేసుకున్నారు. పాకిస్థాన్ భద్రతా బలగాల కాల్పుల్లో గత రెండు రోజుల్లో పీఓకేలో కనీసం 32 మంది కశ్మీరీ నిరసనకారులు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వస్తున్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఓ వీడియోలో ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ "అక్కడ నిరసన చేస్తున్న వారిని కూడా భారత్‌ను చూసినట్టే చూస్తాను. వాళ్లూ మా శత్రువులే" అని అన్నారు. ఈ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పీఓకేలో శాంతియుతంగా నిరసనలు చేస్తున్న ప్రజలను శత్రువులుగా చిత్రీకరించడం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జూన్ 5 నుంచి పీఓకేలో హింసాత్మక ఘటనలు కొనసాగుతున్నాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు 90 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మీర్‌పూర్ నగరంలో భద్రతా బలగాలు ప్రజలపై నేరుగా కాల్పులు జరుపుతున్న దృశ్యాలు, మృతదేహాలను వాహనాల్లో తరలిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి.

## ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ పకడ్బందీగా ఉండాలి

మొదటిపేజీ తరువాయి – సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను స్పష్టంగా ఆదేశించారు. జాబ్ కేలండర్-2026 అమలుపై ఆయన అధ్యక్షతన ఏర్పాటైన మంత్రుల బృందం బుధవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించింది. ఈ సమావేశానికి పలువురు మంత్రులు ఆన్‌లైన్ ద్వారా హాజరు కాగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా కీలక అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు, వాటి భర్తీకి అనుసరించాల్సిన విధివిధానాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రుల బృందానికి వివరించారు. జాబ్ కేలండర్-2026లో భాగంగా ప్రకటించిన 10,060 ఉద్యోగాలను మొత్తం నాలుగు దశల్లో భర్తీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా తొలి దశలో వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ ఏడాది మే 15నే నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని అధికారులు గుర్తు చేశారు. రెండో దశ కింద 3,168 పోస్టులకు వాస్తవానికి ఆగస్టు 15న నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది. అయితే, రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో ఎదురైన కొన్ని సాంకేతిక ఇబ్బందులు, ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో ఈ ప్రక్రియలో స్వల్ప జాప్యం జరిగింది. ఈ కారణాలను పరిగణనలోకి తీసుకున్న మంత్రుల బృందం, రెండో దశ నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 15న విడుదల చేయాలని నిర్ణయించింది.

### 3, 4 దశల నోటిఫికేషన్లు అక్టోబర్‌లో

జాబ్ కేలండర్‌ను వేగంగా పూర్తి చేసేందుకు వీలుగా మూడు, నాలుగు దశల ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఒకేసారి అక్టోబర్ 15న విడుదల చేయాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. మూడో దశలో 2,388 పోస్టులు, నాలుగో దశలో 2,981 పోస్టులు భర్తీ చేయనున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆయా శాఖల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఖాళీలను భర్తీ చేయాలని, ఆ దిశగా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. రెండో దశలో భర్తీ చేయనున్న 3,168 పోస్టుల్లో అత్యధికంగా 2,225 పోస్టులు హోంశాఖ పరిధిలోనే ఉన్నాయని అధికారులు తెలిపారు. గ్రూప్-1లో ప్రస్తుతం గుర్తించిన పోస్టుల సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందని మంత్రుల బృందం ఈ సందర్భంగా అభిప్రాయపడింది. మొత్తం 10,060 పోస్టుల భర్తీ ప్రక్రియలో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా, సకాలంలో పూర్తి చేసి, ప్రతి ఏటా జాబ్ కేలండర్ విడుదల చేసే సంప్రదాయాన్ని కొనసాగించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. జాబ్ కేలండర్-2026కు సంబంధించిన పూర్తిస్థాయి ఖాళీల వివరాలను ఈ నెల 6న జరగనున్న కేబినెట్ సమావేశం ముందు ఉంచనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో మంత్రులు వంగలపూడి అనిత, పి. నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా, ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్ చంద్, ఏపీపీఎస్సీ కార్యదర్శి రవి సుభాష్ పాల్గొన్నారు.

## కాళేశ్వరం నుంచి నీటి చుక్క వాడకుండా అత్యధిక ధాన్యం పండించిన తెలంగాణ

మొదటిపేజీ తరువాయి – భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన బుధవారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టిన వారం రోజుల్లోనే లీక్ అయిందన్నారు. ఈ విషయం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కి కూడా తెలుసునని పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డి సహా అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పినా పట్టించుకోలేదని అన్నారు. సుమారు మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ప్రాజెక్టుకు రూ.16 వేల కోట్ల వడ్డీ రూపంలో కడుతున్నామని వివరించారు. కాళేశ్వరంపై బీఆర్ఎస్ పార్టీ పిచ్చి రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. కానీ ఆ ప్రాజెక్ట్‌తో తాము అలాంటి రాజకీయాలు చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బాధ్యత లేకుండా మాట్లాడడం దురదృష్టకరమని అన్నారు. ఇసుకలో కాళేశ్వరం ఫౌండేషన్ వేశారని గుర్తు చేశారు. ఐఐటీ బాంబే ఆఫ్రి కంపెనీతో సాయిల్ టెస్ట్ చేయించామని పేర్కొన్నారు. బ్యారేజీలు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయని.. అంటే అది ఓపెన్ చేస్తే ప్రజలకు ఏమైనా అయితే ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కక్కుర్తి, అసమర్థత వలన కాళేశ్వరం కూలిపోయిందని విమర్శించారు. అయితే కాళేశ్వరం విషయంలో తమకు రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం విషయంలో బిఆర్ఎస్ పార్టీ బూటకపు ప్రచారం చేస్తుందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్ నుంచి కన్నెపల్లి పంపు హౌస్‌కు18 కిలోమీటర్ల దూరం ఉందన్నారు. అన్నారం బ్యారేజ్‌కి రంధ్రాలు ఉన్నాయని జస్టిస్ ఘోష్ రిపోర్ట్ ఇచ్చిందని గుర్తు చేశారు. చీఫ్ మొదట ప్రిలిమినరీ రిపోర్ట్ నవంబర్ 23 ఇచ్చిందని అన్నారు. కమీషన్ల కోసం ఫౌండేషన్ చూసుకోకుండా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు రూ. 1400 కోట్లు కాళేశ్వరం కాంట్రాక్టర్లు చెక్ రూపంలో ఇచ్చారని కల్వకుంట కవిత చెప్పారని..అది వాస్తవమని పేర్కొన్నారు. తనకు తెలిసి తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ప్రాజెక్టు కూడా మేఘా సంస్థకు ఇవ్వలేదన్నారు. ఎన్డీఎస్ఏ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా సీబీఐకి లేఖ రాశామని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి 24 గంటల్లో సీబీఐ విచారణ జరిపిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ధాన్యం కుంభకోణం చేసిన వారిని అరెస్ట్ చేస్తామన్నారు. గాదీజ టన్నులు తమ హయంలో పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

## పీఓకేలో రక్తపాతం.. పాక్ బలగాల దాడిలో 40 మంది మృతి

మొదటిపేజీ తరువాయి – తెలుపుతున్న పౌరులపై పాకిస్థాన్ బలగాలు జరిపిన దమనకాండలో గత రెండు రోజుల్లో కనీసం 40 మంది ప్రాణాలు కోల్పోయారు. డజన్ల కొద్దీ ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రాంతంలో తీవ్ర అశాంతి నెలకొన్న నేపథ్యంలో పాక్ సైన్యం విచక్షణారహితంగా వ్యవహరిస్తోందని స్థానిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. 'యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ' (యూకేపీఎన్‌పీ) ఈ ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నెల 27, 28 తేదీల్లో రావల్‌కోట్, మీర్పూర్ సహా పలు ప్రాంతాల్లో పాక్ బలగాలు జరిపిన దాడుల్లో 40 మంది పౌరులు మరణించారని, వందలాది మందిని అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించింది. అంతేకాకుండా జూన్ 5 నుంచి ఇప్పటివరకు 100 మందికి పైగా పౌరులను పాక్ సైన్యం చంపేసిందని, వందల మందిని బలవంతంగా అదృశ్యం చేసిందని పేర్కొంది. ఇదిలా ఉండగా, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) నేత సర్దార్ అమ్మాన్ ఖాన్ కూడా పాక్ సైన్యంపై విరుచుకుపడ్డారు. ఇది నిరాయుధులైన పౌరులపై జరిగిన 'మారణకాండ' అని ఆయన అభివర్ణించారు. "కేవలం రెండు రోజుల్లోనే పాక్ బలగాలు 38 మంది శాంతియుత నిరసనకారులను అత్యంత కిరాతకంగా చంపేశాయి" అని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పీఓకేలో కొనసాగుతున్న ఈ నిరసనలు, ఇస్లామాబాద్ నియంత్రణకు ప్రత్యక్ష సవాలుగా మారాయి. ఈ ఘటనలపై ఐక్యరాజ్యసమితి, యూరోపియన్ యూనియన్ తక్షణమే స్పందించి, స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని, పౌరులను రక్షించాలని యూకేపీఎన్‌పీ డిమాండ్ చేసింది. ప్రస్తుతం పీఓకేలోని చాలా ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థలను పూర్తిగా నిలిపివేసి, కర్ఫ్యూ వాతావరణం విధించారు.

## రాహుల్ గాంధీ కుటుంబానికి బాబ్రీ మసీదుకు పట్టిన గతే

మొదటిపేజీ తరువాయి – చేసిన కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే యశ్‌పాల్ సువర్ణపై పోలీసులు కేసు నమోదు చేశారు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేసిన ఘటనను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ ఇదే తరహా రాజకీయాలు కొనసాగిస్తే రాహుల్ గాంధీ కుటుంబానికీ అదే పరిస్థితి వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. సామాజిక మాధ్యమాల్లో ప్రసంగం వీడియో వైరల్ కావడంతో కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ఉడుపిలో నిర్వహించిన బీజేపీ కార్యక్రమంలో యశ్‌పాల్ సువర్ణ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఉడుపి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అశోక్ కుమార్ కొడవూర్ ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విద్వేషాన్ని రెచ్చగొట్టేలా, బెదిరింపులకు పాల్పడేలా ఎమ్మెల్యే మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కర్ణాటక కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మంజునాథ్ భండారి తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ప్రమాణం చేసిన ప్రజాప్రతినిధి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వివాదం, దేశవ్యాప్త నిరసనల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే రాహుల్ గాంధీపై బీజేపీ వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఉన్న ఇతర బీజేపీ ప్రజాప్రతినిధులు కూడా ఈ వ్యాఖ్యలను ఖండించకపోవడం ఆందోళనకరమని అన్నారు.

## కొత్త విద్యామంత్రిపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి – జోషిని రేపిస్టుల మద్దతుదారుడి అభివర్ణిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుపట్టారు. బిల్కిస్ బానో కేసులో దోషుల విడుదలను గతంలో సమర్థించిన వ్యక్తికి కీలకమైన విద్యాశాఖను ఎలా అప్పగిస్తారని ఆయన ప్రశ్నించారు. మంగళవారం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, "నేరస్తులను సమర్థించే వ్యక్తి కంటే నీచమైన వ్యక్తి మరొకరు ఉండరు. ప్రహ్లాద్ జోషి నియామకం మన విద్యా వ్యవస్థకు, ప్రతి విద్యార్థికి అవమానకరం" అని వ్యాఖ్యానించారు. క్యాబినెట్‌లో ఇతర సమర్థులైన మంత్రులు ఉండగా, జోషినే ఎందుకు ఎంచుకున్నారో ప్రధాని సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. రాహుల్ సోదరి, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా సైతం లోక్‌సభలో ఇదే అంశాన్ని ప్రస్తావించారు. గర్భిణిపై అత్యాచారం చేసిన వారి విడుదలను సమర్థించిన వ్యక్తికి కీలక పదవి ఇవ్వడం ద్వారా దేశంలోని కోట్ల మంది విద్యార్థినులకు ప్రధాని ఎటువంటి సందేశం పంపుతున్నారని ఆమె ప్రశ్నించారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీ ఆరోపణలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనల నేపథ్యంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ బాధ్యతలను అప్పగించారు. 2018లో గుజరాత్ ప్రభుత్వం బిల్కిస్ బానో కేసులో 11 మంది దోషులను విడుదల చేయగా, అప్పట్లో కేంద్ర మంత్రిగా ఉన్న జోషి ఆ నిర్ణయాన్ని సమర్థించారు. దోషులు జైలులో సుదీర్ఘ కాలం గడిపారని, వారి ప్రవర్తన బాగుందని ఆయన పేర్కొనడం అప్పట్లో వివాదాస్పదమైంది. అయితే, 2024లో సుప్రీంకోర్టు ఈ విడుదలను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. మరోవైపు, కాంగ్రెస్ విమర్శలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. లోక్‌సభలో ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలు వ్యక్తిత్వ హననం కిందకు వస్తాయని ఆరోపించింది. ట్రెజరీ బెంచీల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవడంతో, స్పీకర్ ఓం బిర్లా ఆమె ప్రసంగంలోని కొన్ని భాగాలను సభ రికార్డుల నుంచి తొలగించాలని ఆదేశించారు.

## హైడ్రా కమిషనర్‌ను తప్పించాలన్న హైకోర్టు ఘాటుగా స్పందించిన రేవంత్ రెడ్డి



మొదటిపేజీ తరువాయి – కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని, ఆ సంస్థను మరింత బలోపేతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైడ్రా అనేది తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అతిపెద్ద సంస్కరణ అని అభివర్ణించారు. ఆక్రమణదారులు నకిలీ పత్రాలతో న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తూ, సోషల్ మీడియా వేదికగా ఏజెన్సీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. "బతుకమ్మ కుంటను ఆక్రమించింది పేదలా లేక పెద్దలా? ఒక బీఆర్ఎస్ నేత అక్కడ 10 ఎకరాలు కబ్జా చేశారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? గండిపేట చెరువు వద్ద కూల్చివేసినవి సామాన్యుల నిర్మాణాలా?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. భూ కబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. కబ్జాదారులను రక్షించేందుకు భారీగా నిధులు వెచ్చిస్తూ సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేశ్ కుమార్‌పై 400 కోర్టు ధిక్కరణ కేసులు ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. హైడ్రా విషయంలో ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని, ఒక అధికారిని ఎక్కడ నియమించాలన్నది ప్రభుత్వ విచక్షణాధికారమని ఆయన పేర్కొన్నారు. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లోనే ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

# మాదాపూర్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్, మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సైబరాబాద్ సీపీ



**నిజం న్యూస్ సైబరాబాద్, జూలై 29:** సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, మాదాపూర్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్, మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లను సందర్శించి అక్కడి మౌలిక సదుపాయాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, ట్రాఫిక్ నిర్వహణ విధానం, పోలీసు సిబ్బంది పనితీరును సమీక్షించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన సీపీ, ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన పోలీసింగ్ అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో శాస్త్రీయ పద్ధతుల్లో ట్రాఫిక్ నిర్వహణ చేపట్టి, వాహనదారులు , పాదచారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే స్టేషన్‌లలో మౌలిక వసతులను సక్రమంగా నిర్వహిస్తూ, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో వేగం, సిబ్బంది సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సీపీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఖ×)ను కూడా సందర్శించిన సీపీ, ట్రాఫిక్ సిబ్బందికి అందిస్తున్న శిక్షణ విధానాన్ని సమీక్షించారు. విధి నిర్వహణలో వృత్తి నైపుణ్యం, మర్యాదపూర్వక ప్రవర్తన, ప్రజా సేవా దృక్పథానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల సందర్భంగా వాహనదారులు, ప్రజలతో మర్యాదగా, సంయమనంతో వ్యవహరించాలని, చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తూనే ప్రజల గౌరవాన్ని కాపాడే విధంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి చర్యలో వృత్తిపరమైన నడవడి, పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్, ట్రాఫిక్--× డీసీపీ రవికుమార్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, మాధాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ లక్ష్యం పథకాలతో సంబంధం లేదన్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి

**నిజం న్యూస్ హైదరాబాద్ జూలై 29:** తెలంగాణాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఓటరు జాబితా సవరణకు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నాడు ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా డిజిటలైజేషన్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిఇఓ మాట్లాడుతూ కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ కేవలం తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు మాత్రమేనని, ప్రభుత్వం పథకాలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించేందుకు మరో ఐదు రోజులు గడువు మాత్రమే ఉన్నందున ఆగస్టు మూడవ తేదీలోగా డిజిటలైజేషన్ ప్రక్రియ 100శాతం పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 76% డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని, గ్రామీణ ప్రాంతాల్లో 90శాతం పూర్తయిందని, ఇందులో ఖానాపూర్, బాల్కొండ, ఎల్లారెడ్డి, హుజూర్ నగర్, నర్సంపేట్, వర్ధన్నపేట్, పరకాల, బోధ్ నియోజకవర్గాల్లో 100శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఇందుకు సంబంధించిన అధికారులను సిఇఒ ప్రశంసించారు. శేరిలింగంపల్లి, రంగారెడ్డి, మేడ్చల్, జిహెచ్ఎంసితో పాటు నిజామాబాద్, వరంగల్, ఖమ్మం లిం




పట్టణ ప్రాంతాలలో డిజిటలైజేషన్ ప్రక్రియపై సంబంధిత డిఇఒలు ప్రత్యేక దృష్టి సారించి డిజిటలైజేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలను డిజటలైజేషన్ చేయడంలో ఓటరు పేర్లను తప్పులు లేకుండా అప్ లోడ్ చేసేలా బిఎల్ఒలు, సూపర్ వైజర్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇఆర్ఒ, ఎఇఆర్ఒలు దీనిపై సమీక్షించి తప్పులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. డిజిటలైజేషన్ లో నిర్లక్ష్యం వహించిన బిఎల్ఒలు, సూపర్ వైజర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఇఒ హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ స్టేషన్ల రాష్నలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఒకే కుటుంబ సభ్యుల పేర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. ఓటర్లలో మరణించిన వారు, ఇల్లుమరిన వారి వివరాలు, అందుబాటులో లేని వారి (ఎ.ఎస్.డి) జాబితాను సిద్ధంచేసేటప్పుడు అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన బిఎల్ఎల సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఇఆర్ఒ, ఎఇఆర్ఒ, బిఎల్ఒ స్థాయిలలో జరిగే రాజకీయ పార్టీల సమావేశాలను వీడియోగ్రాప్ చేసి డాక్యుమెంట్ చేయాలన్నారు. దాంతోపాటు విఐపి, వివిఐపిల ఓటర్లను గుర్తించి మ్యాపింగ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్లు, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, డిప్యూటీ ఎన్నికల అధికారి జి ఎస్ చారి, పిఎం ఐటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# గురుపౌర్ణమి సందర్భంగా శిరిడి సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 29:** గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫిల్మ్‌నగర్‌లోని శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్, వారి సతీమణి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. కె.పి.హెచ్.బి శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి యోగా విజ్ఞాన కేంద్రం ఆచార్యులు, పూజ్య గురువులు జగన్ గురూజీ ని వారి శిష్యబృందం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల దేశాల్ అన్న, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు గాదె శివ, మిత్రబృంద సభ్యులు పాల్గొన్నారు. తదుపరి కేపీహెచ్‌బీ రోడ్ నెం.2లోని శ్రీ శిరిడి సాయిబాబా ఆలయాన్ని దర్శించి స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం 2 కూకట్పల్లిలోని ప్రసిద్ధ శ్రీ చిత్తారమ్మ ఆలయం సన్నిధిలోని శ్రీ శిరిడి



సాయిబాబా ఆలయాన్ని సందర్శించి స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. అలాగే కేపీహెచ్‌బీ భాగ్యనగర్ కాలనీలోని శ్రీ శిరిడి సాయి మందిరాన్ని సందర్శించి గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొని సాయిబాబా ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ లియువనాయకుడు గాదె శివ మాట్లాడుతూ, "సాయిబాబా బోధించిన శ్రద్ధ, సహనం అనే రెండు విలువలు ప్రతి మనిషి జీవితానికి మార్గదర్శకాలు. అన్ని మతాలు సమానమే, మానవత్వమే పరమమతమని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు శిరిడి సాయిబాబా. హిందూ, ముస్లిం, క్రైస్తవులు సహా అన్ని మతాలవారు సోదరభావంతో జీవించాలని ఆయన సందేశం నేటి సమాజానికి అత్యంత అవసరం" అని పేర్కొన్నారు. అలాగే మాతా అన్నపూర్ణేశ్వరి యోగా విజ్ఞాన కేంద్రం అధిపతి, యోగ గురువు జగన్ గురూజీ సేవలను కొనియాడారు. ఆయన యోగా ద్వారా ఆరోగ్య అవగాహన కల్పించడం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం, సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడం, ప్రజలంతా ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేయడం నిజంగా అభినందనీయమని అన్నారు. ఇలాంటి గురువులు సమాజానికి దిశానిర్దేశం చేస్తూ ఎంతో మేలు చేస్తున్నారని, ఈ గురుపౌర్ణమి రోజున అటువంటి మహనీయ గురువులను దర్శించుకోవడం తమకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం ప్రజలందరికీ గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, సాయిబాబా ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల దేశాల్ అన్న మిత్రమండలి సభ్యులు, సీనియర్ నాయకులు గంధం రాజు, డివిజన్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి, "మానవసేవే మాధవసేవ" సంస్థకు చెందిన లక్ష్మీనారాయణ, సూరిబాబు, గోవింద్ గౌడ్, రమణ, వరుణ్, సాయినాథుని భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టీడీఆర్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌ను కలిసిన ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్

**నిజం న్యూస్ ప్రతినిధి, మేడిపల్లి, జూలై 29 :** టీడీఆర్ మార్కెట్ విలువల అమలు, అదనపు ఫ్లోర్ల అనుమతులు, సెట్‌బ్యాక్ మినహాయింపులు, అలాగే బుల్డ్ నౌ పోర్టల్ లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతూ ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఐఏఎస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ జే.టి. విద్యాసాగర్, సభ్యులు మోహన్ రావు, పి.ఏ.ఎస్. మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ, 2026 జూన్ 4కు ముందు భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తులు సమర్పించినప్పటికీ, ప్రస్తుతం అధికారులు సవరించిన మార్కెట్ విలువల ఆధారంగా టీడీఆర్ మొత్తాలను లెక్కించి అదనపు చెల్లింపులు (షార్ట్‌ఫాల్) చూపుతున్నారని తెలిపారు. దీంతో బిల్డర్లు, డెవలపర్లు తీవ్ర ఆర్థిక భారం ఎదుర్కొంటున్నారని వివరించారు. జూన్ 4కు ముందు సమర్పించిన దరఖాస్తులకు అప్పటి అమల్లో ఉన్న మార్కెట్ విలువలనే వర్తింపజేయాలని, దరఖాస్తు సమర్పించిన తేదీ ఆధారంగా టీడీఆర్ విలువలు లెక్కించేలా బుల్డ్ నౌ పోర్టల్ లో అవసరమైన సాంకేతిక మార్పులు చేపట్టాలని కోరారు. అదేవిధంగా, ఇప్పటికే భవన నిర్మాణ అనుమతులు పొంది, అన్ని ఫీజులు చెల్లించి, జి .ఓ . ఎమ్మెస్. నెంబర్.168 ప్రకారం 10 శాతం మార్టిగేజ్ ప్రక్రియను పూర్తి చేసిన బిల్డర్లు, ప్రస్తుతం జి .ఓ . ఎమ్మెస్.



నెంబర్.95 ప్రకారం టీడీఆర్ అదనపు ఫ్లోర్లు, సెట్‌బ్యాక్ మినహాయింపుల కోసం సవరించిన దరఖాస్తులు సమర్పించేందుకు ప్రయత్నిస్తుండగా, బుల్డ్ నౌ పోర్టల్ వాటిని అంగీకరించకపోవడం వల్ల పనులు నిలిచిపోతున్నాయని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు, జి .ఓ . ఎమ్మెస్. నెంబర్.95 అమలుపై ఉన్న సందిగ్ధతను తొలగించాలని, జి హెచ్ ఎం సి , హెచ్ఎండిఏ, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల అధికారులకు ఏకరీతి విధానాన్ని అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంలోని అంశాలను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఐఏఎస్ సానుకూలంగా స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి తగిన నిర్ణయం తీసుకునేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

# మల్కంచెరువు, సిటీ వైన్స్ వాటర్‌లాగింగ్ ప్రాంతాలు, సీఓడీ పైప్‌లైన్ పనులను పరిశీలించిన సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేష్

**నిజం న్యూస్ సైబరాబాద్, జూలై 29:** వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను వేగవంతం చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, సూచించారు. ఈ సందర్భంగా రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కంచెరువు వాటర్‌లాగింగ్ పాయింట్, సిటీ వైన్స్ వాటర్‌లాగింగ్ ప్రాంతాన్ని, అలాగే మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెంటర్ ఫర్ ఆర్గనైజేషన్ డెవలప్‌మెంట్ (జూణ) పైప్‌లైన్ పనుల పురోగతిని సీపీ సంబంధిత సివిక్ బాడీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాటర్‌లాగింగ్ సమస్యకు కారణమవుతున్న అంశాలను అధికారులు వివరించగా, వర్షపు నీరు వేగంగా వెళ్లేలా అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని సీపీ సూచించారు. డ్రైనేజీ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచడం, నీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగించడం, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడం ద్వారా ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే సీఓడీ పైప్‌లైన్ పనులను వేగవంతం చేసి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పనుల జరుగుతున్న ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు పాటించడంతో పాటు, అవసరమైన ట్రాఫిక్ మళ్లింపులపై ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, తో పాటు సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్), సన్ ప్రీత్ సింగ్, సీఎంసీ కమిషనర్ సృజన, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, మాధాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, సీఎం సి డిప్యూటీ కమిషనర్, ఏఈ/ఏఈఈ అధికారులు, న్ణ=ూూ సిబ్బంది, ఇతర సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పలు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



# బీరంగూడ డివిజన్ పరిధిలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

## ప్రత్యేక పూజల్లో కాట సుధారాణి తో కలిసి పాల్గొన్న శశిధర్ రెడ్డి



**నిజం న్యూస్ అమీన్ పూర్, జూలై 29:** బుధవారం రోజున పవిత్ర గురుపౌర్ణమి సందర్భంగా అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ డివిజన్ పరిధిలోని సాయి కాలనీ, ఎన్ఆర్ఐ కాలనీ, గోశాలలో గల సాయిబాబా ఆలయాలలో గురుపౌర్ణమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధాశ్రీనివాస్ గౌడ్ , అమీన్పూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి ప్రత్యేక అతిథులుగా పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మరియు ఆలయ నిర్వాహకులు ఇరువురు నాయకులకి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో సాయిబాబా వారికి వేదమంత్రాల మధ్య అభిషేకం, ప్రత్యేక పూజలు మరియు హారతి కార్యక్రమాలు నిర్వహించి బాబా ఆశీస్సులు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తుల కొరకు అన్నదాన ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, ఆలయ డైరెక్టర్లు రమేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, కుమ్మరి మహేష్, చంద్రశేఖర్, జన్ముల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్ నాయక్, బిక్షపతి, కృష్ణ, రామచంద్రారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మనోహర్, మస్తాన్ నాయుడు, రాము, మల్లారావు, ఉమా శంకర్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# మహిళల ఆత్మరక్షణకు మార్షియల్ ఆర్ట్స్ అవసరం: సినీ నటుడు సుమన్

**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి జూలై 29:** మహిళల స్వీయ రక్షణకు మార్షియల్ ఆర్ట్స్ ఎంతగానో దోహదపడతాయని ప్రముఖ సినీ నటుడు డాక్టర్ సుమన్ తల్వార్ అన్నారు. కూకట్‌పల్లి వివేకానందనగర్‌లోని టైకా మార్షియల్ ఆర్ట్స్ అకాడమీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సెప్టెంబర్ 5, 6 తేదీల్లో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరగనున్న టైకా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్--2026 బ్రోచర్‌తో పాటు ట్రోఫీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టైకా మార్షియల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ పి. అశోక్ చక్రవర్తి మాట్లాడుతూ, దేశంలోని 10 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఆగస్టు 20లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 5, 6 తేదీల్లో జరిగే పోటీల ముగింపు కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్, సినీ నటుడు డాక్టర్ సుమన్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు పతకాలు అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్వేత, నవతా, మానస, అనిల్, నందిత, దినేష్, మణిరాజ్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# తృతీయ పుష్కర గురుపౌర్ణమి మహోత్సవములలో పాల్గొన్న జనసేన నాయకులు: ముమ్మారెడ్డి ప్రేమకుమార్



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 29:** బుధవారం గురుపౌర్ణమి సందర్భంగా బాలానగర్ డివిజన్ సాయి నగర్ లోని శ్రీ సాయి నాగేంద్ర ఆలయ కమిటీ సభ్యులు గడ్డం నాగరాజు కిషోర్ చైర్మన్ అంబటి సునీల్ ఆహ్వానం మేరకు కూకట్పల్లి నియోజకవర్గజనసేన పార్టీ కంటెస్ట్ ఎం.ఎల్.ఏ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ విచ్చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రేమ కుమార్ ని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ ఆలయ ఏర్పాట్లు అన్నదాన కార్యక్రమం గురించి తెలుసుకొని కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గడ్డం నాగరాజు కిషోర్ ,కొల్లా శంకర్ , శేషు ఆలయ కమిటీ చైర్మన్ అంబటి సునీల్ ,జనరల్ సెక్రటరీ వి.వెంకటేశ్వర్లు ,ఆలయ కమిటీ మెంబర్స్ పి.మనోహర్ రెడ్డి,మధు బాబు, రాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# స్వర్గీయ పరిమి వెంకయ్య దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి జూలై 29:** కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో నివాసముంటున్న మిత్రులు పరిమి వెంకట శ్రీరామణ తండ్రి స్వర్గీయ పరిమి వెంకయ్య దశదినకర్మ (స్మారక) కార్యక్రమం బుధవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని స్వర్గీయ పరిమి వెంకయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వెంకయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించి, కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, స్థానిక ప్రముఖులు, శ్రేయోభిలాషులు పాల్గొని స్వర్గీయ పరిమి వెంకయ్య కి ఘనంగా నివాళులర్పించారు.

# జర్నలిస్టులంటే అందరికీ చులకనే...!

## రేవంత్ రెడ్డిది ఒక తీరు.... కెసిఆర్ ది మరో తీరు

## జర్నలిస్టులకో న్యాయం.. హైడ్రాకు మరో న్యాయం..

**నిజం న్యూస్ హైద్రాబాద్, జూలై 29:** ఎవరికి పుట్టిన బిడ్డరా.. అన్నట్టుగా వున్నది రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితి. ఎవరు అధికారంలో వున్నా జర్నలిస్టుల సమస్యలు మాత్రం పరిష్కరించేందుకు ఆసక్తి చూపకపోవడం విచారకరం. ప్రతిపక్షంలో వున్నప్పుడు మేము అధికారంలోకి రాగానే మీ సమస్యలను పరిష్కరిస్తామని తమ అజెండాలో పెట్టుకుంటారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వీటి గురించి మాట్లాడేందుకూడా ఆసక్తి చూపారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణే జీచీజీనూ సొసైటీకి స్థలాలు కేటాయింపు విషయంలో గతంలో కెసిఆర్ ప్రభుత్వం, ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం దోబూచులాడుతోంది. జీచీజీనూ కి స్థలాలు కేటాయించాలని సుప్రీంకోర్టు తీర్పులిచ్చినా కెసిఆర్ ప్రభుత్వం ఆ తీర్పులను బుట్ట దాఖలు చేసింది. ఇదీ మరింత దారుణమైన విషయం. అప్పట్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా వున్న సోమేశ కుమార్పై కోర్టు ధిక్కరణ పిటీషన్లు వున్నా కెసిఆర్ ప్రభుత్వ పట్టించుకోలేదు. ప్రతిపక్షంలో వున్నప్పుడు యిఅయిస్త్రం కి కోర్ట్ తీర్పు మేరకు స్థలాలు కేటాయిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆమేరకు మాట నిలబెట్టుకున్నారు. అయితే స్థలాలు విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తుది తీర్పును తమకనుకూలంగా మార్చుకుని కోర్టు తీర్పు నేపథ్యంలో స్థలాలు ఇవ్వలేమని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి యిఅయిస్త్రం మొండి చేయి చూపారు. విచిత్రమేమంటే ప్రస్తుతం హైడ్రా రంగనాథను మార్చమని హైకోర్టు ఆదేశాలిస్తే దాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పు పట్టడం విచిత్రంగా వున్నది. మరి యిఅయిస్త్రం సొసైటీకి చెందిన జర్నలిస్టుల విషయంలో కోర్టు తీర్పును ముఖ్యంత్రి ఎందుకు తప్పు పట్టడం లేదు. తనకు నచ్చిన వారి పట్ల ఒక తీరు, నచ్చని వారిపట్ల ఒక తీరుగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ తీరుపట్ల సర్వత్రా చర్చ జరుగుతోంది. కోర్టు తీర్పులు తమకు అనుకూలంగా ఉంటే ఒక రకం, వ్యతిరేకంగా ఉంటే మరో రకంగా విచక్షణాధికారాన్ని ఉపయోగించడమేమిటన్నది ప్రశ్నర్థాకంగా మారింది. హైడ్రా కమిషనర్ వ్యవహరిస్తున్న తీరుపై రాష్ట్ర హైకోర్టు ఆయనను వెంటనే తప్పించాలని ఆదేశించింది. దీనిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వీకరించకపోగా విచక్షణ అధికారం పేరుతో హైడ్రా ఆగదు.. వెనక్కి తగ్గదు.. అంటూ ప్రకటించారు. “కోర్టు ధిక్కరణ కేసుల్లో అధికారులను మార్చాలన్న నిబంధన ఉదంటున్నారు... గతంలో సోమేశ్ కుమార్ మీద 400 కోర్టు ధిక్కరణ కేసులున్నాఎవరూ ఆ విషం గురించి మాట్లాడలేదు... ఒక అధికారిని ఎక్కడ నియమించాలన్నది ప్రభుహ్వ విచక్షణాధికారం క్రిందకు వస్తుంది.. ఆ అధికారాన్ని ఎవరూ గుంజుకోలేరు ... “ అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదురు దాడికి దిగేరు. మరి కోట్లాది రూపాయల డబ్బులు కట్టి 20 ఏళ్లుగా ఇళ్లస్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టులకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వ విచక్షణ అధికారాన్ని ఉపయోగించి సీఎం ఆ స్థలాలను ఎందుకు ఇవ్వడం లేదు..?అనే ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కోర్టు తీర్పుల పేరు చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోట్లాది రూపాయల విలువైన జర్నలిస్టుల భూములను లాక్కోవడమే లక్ష్యంగా పనిచేయడం యావత్తు జర్నలిస్టులోకాన్ని విస్మయానికి గురిచేస్తుంది.

**సీఎం కి విశేష అధికారాలున్నాయా!?**

“ముఖ్యమంత్రికి విశేష అధికారం” అంటూ ప్రత్యేకంగా మన రాజ్యాంగంలో ఎక్కడా పేర్కొనలేదు. ఏదైనా ప్రత్యేకాధికారాలున్నాయంటే అది మంత్రి వర్గం ఆమోదంతోనే జరగాలి. రాష్ట్ర ప్రభుత్వ వ్యాపార నిర్వహణ, నియమాలు (రూల్స్ ఆఫ్ బిజినెస్), మంత్రివర్గ నిర్ణయాలు కానీ, అధికారుల నియామకాలు గానీ సంబంధిత చట్టాలకు అనుగుణంగానే జరగాల్సి వున్నది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 166 ప్రకారం అత్యవసర పరిస్థితుల్లో కొన్ని ఫైళ్లపై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకునే అవకాశం కల్పిస్తుంది, కానీ ఆతర్వాత మంత్రివర్గం ఆమోదం కూడా పొందాల్సి ఉంటుంది. ఏ శాఖకు సంబంధించి అయినా చట్టంలో పేర్కొన్న ప్రత్యేక నిబంధన మేరకే ముఖ్యమంత్రి లేదా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి ఏ నిర్ణయం తీసుకున్నా అది కూడా రాజ్యాంగం, చట్టాలు, మంత్రివర్గ నిర్ణయాల పరిధిలోనే ఉండాల్సిందే. విచక్షణాధికారమంటూ ఏమిలేదు. అత్యవసర ప్రజా ప్రయోజన అంశాలుపైనే అది ఆధారపడి ఉంటుంది. “సీఎంకు ప్రత్యేక అధికారం” లేదా “సీఎంకు స్పెషల్ పవర్స్” అనేది రాజకీయంగా వినిపించే పదాలు మాత్రమే కానీ ప్రత్యేకం అంటూ ఏమి లేదు. ముఖ్యమంత్రి తీసుకునే ప్రతి నిర్ణయం రాజ్యాంగం, చట్టాలు, ప్రభుత్వ వ్యాపార నిర్వహణ నియమాల పరిధిలోనే చెల్లుబాటు అవుతుంది. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నా, వాటికి కూడా చట్టపరమైన పరిమితులు వర్తిస్తాయి.

### నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం.. చరిత్ర, ప్రాముఖ్యత,

## ఈ ఏడాది రక్తదాతల దినోత్సవం థీమ్ ఏమిటంటే..



రక్తదానం చేయండి.. ప్రాణదాత కండి ఈ నినాదం గురించి అందరికీ తెలిసిందే. రక్తదానాన్ని గొప్ప దానంగా భావిస్తారు. ఒక యూనిట్ రక్తంముగ్గురు జీవితాలను కాపాడుతుంది. ఇలా రక్తం దానం చేయడం వలన ప్రాణం కాపాడడమే కాదు.. ఆరోగ్యానికి కూడా లాభం. అత్యవసర పరిస్థితుల్లో సరైన సమయంలో రక్తం అందుబాటులో లేకపోతే.. అది రోగి జీవితానికి ప్రాణాంతకం కావచ్చు. ప్రతి సంవత్సరం జూన్ 14వ తేదీ ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ప్రస్తుతం అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్ప దానంగా పరిగణించబడుతుంది. శరీరంలో తగినంత రక్తం లేకపోవడం ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు.. సరైన సమయంలో రక్తం బాధితునికి అందుబాటులో లేకపోతే.. అప్పుడు రోగి జీవితం ప్రమాదంలో పడవచ్చు. అయితే రక్తదానం ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 14న జరుపుకుంటారు. ఈ రోజు ప్రధాన లక్ష్యం.. ప్రజలలో రక్తదానం గురించి అవగాహన కల్పించడం. కనుక ఈ రోజు ప్రపంచ రక్తదాతల దినోత్సవానికి సంబంధించిన కొన్ని విషయాల గురించి తెలుసుకుందాం. ప్రపంచ రక్తదాతల దినోత్సవం చరిత్ర ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని తొలిసారిగా 2004లో జరుపుకున్నారు. 2005లో 58వ ప్రపంచ ఆరోగ్య సభ దీనిని వార్షిక ప్రపంచ కార్యక్రమంగా ప్రకటించింది. అప్పటి నుంచి రక్తదాతల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 14న జరుపుకుంటున్నారు. జూన్ 14 జీవశాస్త్రవేత్త, వైద్యుడు అయిన కార్ల్ ల్యాండ్‌స్టైనర్ పుట్టినరోజు కూడా. ఆయనను ఆధునిక రక్త మార్పిడి స్థాపకుడు అని పిలుస్తారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం 2025 థీమ్ ప్రతి సంవత్సరం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఒక ప్రత్యేక ఇతివృత్తంతో జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అంటే 2025 సంవత్సరానికి ఇతివృత్తం “రక్తం ఇవ్వండి, ఆశను ఇవ్వండి: కలిసి మనం అందరం ప్రాణాలను కాపాడుకుందాం”. ఈ సంవత్సరం ఇతివృత్తం రక్తదానం ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది.

**జగన్నాథునికి వేప పొడిని నైవేద్యంగా ఎందుకు సమర్పిస్తారో తెలుసా..**

ప్రపంచ రక్తదాతల దినోత్సవం ప్రాముఖ్యత రక్తదానానికి చాలా ప్రాముఖ్యత ఉంది. జూన్ 14 రక్తదాతలను గౌరవించడానికి అంకితం చేయబడింది. ప్రపంచ రక్తదాతల దినోత్సవం రక్తదానం గురించి అవగాహన పెంచి, రక్తదానం చేయమని ప్రజలను ప్రోత్సహిస్తుంది. రక్తదానం చేయడం వల్ల పేద ధనిక అనే తేడాలేకుండా ప్రమాదంలో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చు. ఇక రక్త దానం చేయడం వలన అనేక ఆరోగ్య లాభాలు కూడా ఉన్నాయి. రక్తదానం ద్వారా శరీరంలో కొత్త రక్తకణాలు ఉత్పత్తి అవుతాయి. ఇది హృదయ ఆరోగ్యానికి మంచిది. రక్త దానం చేయడం కూడా ఒక సామాజిక బాధ్యత. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు లేదా రక్తహీనతతో బాధపడుతున్నవారికి మీరు ఇచ్చే రక్తం ఒక వరం.

## అరటి పండు నల్లగా మారితే పారేస్తున్నారా?

## ఆగండి ప్రయోజనాలు తెలిస్తే షాక్ అవుతారు!

సాధారణంగా అరటిపండు అనగానే పచ్చిగా లేదా కొద్దిగా పండిన వాటిని తినడానికే చాలామంది ఇష్టపడతారు. కానీ, బాగా పండి, తొక్క నల్లగా మారిన అరటిపండ్లను పారేయడం చాలామంది చేస్తుంటారు. నిజానికి, నల్ల మచ్చలు ఏర్పడిన లేదా పూర్తిగా పండిన అరటిపండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని మీకు తెలుసా? పోషకాలు నిండిన ఈ పండ్లు సులభంగా జీర్ణమవుతాయి. వీటిని తినడం వల్ల కలిగే ప్రయోజనాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పుడు ఒక లుక్కేద్దాం. పండిపోయిన అరటిపండ్లు తినడం సాధారణంగా మంచిదే, కొన్ని ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అయితే, కొన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. పండిపోయిన అరటిపండ్లు పోషకాలు నిండినవే, చాలా సందర్భాలలో తినడానికి సురక్షితమైనవే. మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి, ముఖ్యంగా మధుమేహం ఉన్నట్లయితే, ఎంత మోతాదులో తీసుకోవాలో చూసుకోవడం మంచిది. ఇలా మెత్తబడిన అరటిపండ్ల ప్రయోజనాలు, తినడం వల్ల కలిగే అనర్థాల గురించి తెలుసుకుందాం..

**సులభంగా జీర్ణం:**అరటిపండు పండిన కొద్దీ, దానిలోని పిండి పదార్థాలు చక్కెరగా మారతాయి. దీనివల్ల జీర్ణం చేసుకోవడం చాలా సులభం. బలహీనమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారికి ఇది మంచిది.

**యాంటీఆక్సిడెంట్లు అధికం:** బాగా పండిన అరటిపండ్లలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి కణాల నష్టాన్ని నివారించడంలో సహాయపడతాయి, రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

**గుండె ఆరోగ్యానికి మంచిది:** వీటిలో పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి, ఇవి రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి.

**మానసిక ప్రశాంతత:** పండిన అరటిపండ్లలో ట్రిప్టోఫాన్ అనే అమినో ఆమ్లం ఎక్కువగా ఉంటుంది. ఇది సెరోటోనిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది, తద్వారా ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తుంది, మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది.

**కండరాల నొప్పుల నుండి ఉపశమనం :** పొటాషియం అధికంగా ఉండటం వల్ల కండరాల నొప్పులు, తిమ్మిర్లను తగ్గించడంలో సహాయపడుతుంది.

**రొట్టెలు, స్మూతీలకు ఉత్తమం:** బాగా పండిన అరటిపండ్లు తీపిగా, మెత్తగా మారతాయి. ఇవి అరటిపండు బ్రెడ్, మఫిన్‌లు, స్మూతీలు వంటి వాటికి చాలా బాగుంటాయి. వాటి సహజ తీపి వల్ల అదనపు చక్కెర వేయాల్సిన అవసరం కూడా ఉండదు.



### ఎప్పుడు తినకూడదు/జాగ్రత్తలు:

**చక్కెర స్థాయిలు:** అరటిపండు పండిన కొద్దీ, దానిలోని పిండి పదార్థాలు చక్కెరగా మారతాయి. కాబట్టి, మధుమేహ వ్యాధిగ్రస్తులు లేదా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకోవాలనుకునే వారు బాగా పండిన అరటిపండ్లను పరిమితంగా తీసుకోవాలి లేదా వాటికి బదులుగా కొద్దిగా పచ్చిగా ఉన్న అరటిపండ్లను ఎంచుకోవడం మంచిది.

**బరువు తగ్గాలనుకునే వారికి:**బాగా పండిన అరటిపండ్లలో చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది కాబట్టి, బరువు తగ్గాలనుకునే వారు వీటిని ఎక్కువగా తీసుకోకపోవడం మంచిది.

**వాసన/శిలీంధ్రం:** పండు పూర్తిగా నల్లగా మారి, పులిసిన వాసన వస్తే, జిగురుగా మారితే లేదా దానిపై శిలీంధ్రం (ఫంగస్/బూజు) కనిపిస్తే వాటిని తినకూడదు.

**లోపల నల్లగా ఉంటే :** తొక్క నల్లగా ఉన్నప్పటికీ, లోపలి గుజ్జు పూర్తిగా నల్లగా, మెత్తగా మారితే వాటిని పడేయడం మంచిది.

### పసుపు పొడిని ఇలా స్టోర్ చేయండి..

## మస్త్ రోజులు నిల్వ ఉంటది..!



వంటగదిలో మనం ప్రతిరోజూ ఉపయోగించే ముఖ్యమైన మసాలా దినుసుల్లో పసుపు పొడి ఒకటి. పసుపు రుచి, రంగుతో పాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. అయితే పసుపు పొడిని ఎక్కువ రోజులు సురక్షితంగా నిల్వ చేయడం కొంచెం కష్టమైన పని. ఎందుకంటే సరిగ్గా నిల్వ చేయకపోతే దానిలో చిన్న పురుగులు, దోమలు వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే పసుపు పొడిని తేమ లేని శుభ్రమైన పరిస్థితుల్లో నిల్వ చేయడం చాలా ముఖ్యం. పసుపు కేవలం వంటకాలకే పరిమితం కాదు. ఇది అనేక ఆరోగ్య లక్షణాలను కలిగి ఉంది. భారతీయ సంప్రదాయంలో పసుపు పవిత్రతకు చిహ్నంగా భావించబడుతుంది. ఇందులో ఉండే కర్క్యూమిన్ అనే సహజ పదార్థం శరీరానికి శక్తిని ఇస్తుంది.. దెబ్బలు, వాపులను తగ్గిస్తుంది. పసుపులోని యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు శరీరాన్ని టాక్సిన్ ల నుండి కాపాడతాయి. ఈ ప్రయోజనాలను పూర్తిగా పొందాలంటే పసుపు పొడిని సరిగ్గా నిల్వ చేయడం తప్పనిసరి. పసుపు పొడిని సురక్షితంగా నిల్వ చేసే మార్గాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. గాలి చొరబడని సీసాలు లేదా డబ్బాలు.. పసుపు పొడిని గాలి చొరబడని సీసాలు లేదా డబ్బాలలో ఉంచాలి. ముఖ్యంగా గాజు సీసాలు ఉత్తమమైనవి. తేమ లేని ప్రదేశం.. పసుపు పొడి ఉంచే ప్రదేశం పూర్తిగా తేమ లేకుండా.. చలికాలంలో తడి పడే చోటు కాకుండా ఉండాలి. పొడి స్పూన్ వాడకం.. పసుపు పొడిని తీసేందుకు తడి లేని స్పూన్ ఉపయోగించాలి. తడి స్పూన్ వాడితే తేమ చేరి పురుగులు వచ్చే అవకాశం ఉంటుంది. చిన్న భాగాలుగా నిల్వ.. ఒకేసారి ఎక్కువ పసుపు పొడిని ఒకే డబ్బాలో ఉంచకుండా చిన్న చిన్న భాగాలుగా విడదీసి వాడటానికి వేర్వేరు డబ్బాలలో నిల్వ చేయడం మంచిది. కొత్తగా తీసిన పసుపు కొమ్ముల్లో మట్టితో కలిసిన చెదలు ఎక్కువగా ఉంటాయి. అందుకే వాటిని కొన్న వెంటనే శుభ్రంగా కడగాలి. ముందుగా ఒక బౌల్ నిండా నీటిలో వేసి బాగా కదిలిస్తూ చక్కగా కడగాలి మట్టి పూర్తిగా తొలగేలా చూడాలి. అనంతరం ఆ పసుపు తడి లేకుండా ఉండేలా స్పాంజ్ గానీ.. శుభ్రమైన కాటన్ గానీ ఉపయోగించి తుడవాలి. తడి పూర్తిగా పోయేంత వరకు వర్షంలో లేదా తేమ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఉంచకూడదు. పసుపు పూర్తిగా ఆరిన తర్వాత వాటిని కాగితం టవల్ తో చుట్టాలి. తర్వాత గాలి చొరబడని ఏర్ టైట్ డబ్బాలో వేసి ఫ్రిజ్ లోని కూరగాయల విభాగంలో నిల్వ చేయాలి. అవసరమైతే ఆ తరువాత వాటిని చిన్న ముక్కలుగా కట్ చేసి జిప్ లాక్ కవర్ లో పెట్టి ఫ్రీజర్ లో కూడా భద్రపరచవచ్చు. ఇలా చేస్తే పసుపు ఎక్కువ రోజులు నాణ్యతతో ఉండే అవకాశం ఉంటుంది. పసుపు పొడి లాంటి మసాలా పదార్థాలను ఎప్పటికీ నేరుగా ఎండ తగిలే ప్రదేశాల్లో ఉంచకూడదు. ఎక్కువ వెలుతురు లేదా వేడి ఉన్న ప్రదేశాల్లో ఉంచితే పసుపు తన అసలైన లక్షణాలను కోల్పోతుంది. రంగు మారిపోవచ్చు, దుర్వాసన రావచ్చు. అందుకే పసుపు పొడిని చల్లగా నీడ ఉన్న ప్రదేశంలో ఉంచడం ఉత్తమం. ఈ సూచనలు పాటిస్తే మీరు ఇంట్లో ఉన్న పసుపు పొడిని.. అలాగే తాజా పసుపును నాణ్యత కోల్పోకుండా ఎక్కువ రోజుల పాటు తాజాగా ఉంచుకోవచ్చు. ఆరోగ్య ప్రయోజనాలు పొందడానికి ఇలా నిల్వ చేయడమే ఉత్తమమైన మార్గం.

### స్వర్గీయ పరిమి వెంకయ్యకు ఘనంగా నివాళులు అర్పించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం, కూకట్పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 29:** కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నెంబర్ మూడులో నివాసముంటున్న పీ వి. రమణ తండ్రి స్వర్గీయ పరిమి వెంకయ్య దశదినకర్మ కార్యక్రమం బుధవారం రోజు కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల సమక్షంలో నిర్వహించబడింది. స్వర్గీయ పరిమి వెంకయ్య చిత్రపటానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం, ఉపాధ్యక్షులు వంగాల కొండల్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మహేందర్, కూకట్పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య, పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వెంకయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించి, కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కూకట్పల్లి జనరల్ సెక్రటరీ నాగుల అంజిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగార్జున, ఈసీ మెంబర్ సుజాత, అనిల్ కిషోర్, శివ, రామకృష్ణ, బి. శ్రీధర్, జి. శ్రీధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పథంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం

### 93 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన - మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూలై 29:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం డివిజన్ లోని రొడా మేస్త్రి నగర్ లో రూ.31 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, అలాగే సుభాష్ చంద్రబోస్ నగర్--ఏలో సుమారు రూ.62 లక్షల వ్యయంతో మంజూరైన అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్ బాబు కి కృతజ్ఞతలు తెలిపారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని, ముఖ్యంగా వర్షాకాలంలో కాలనీల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ఈ సీసీ రోడ్ల నిర్మాణంతో ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్, జాకీర్ బలరాం, స్థానిక కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, మహిళా నాయకురాలు పద్మ, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు గుమస్తా మధుసూదన్, రషీద్ బేగ్, సలీం, దుర్గేష్, నరేందర్, నాగేందర్, నబి, కొండయ్య, ఆనంద్, రాజు, కిషన్, నీలి శ్రీను, ఆబేద్, ఉస్మాన్, రజాక్ తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణలో భారీ వర్షాలు -- బోగత జలపాతానికి పర్యాటకుల ప్రవేశం తాత్కాలికంగా నిలిపివేత



**నిజం న్యూస్ ములుగు జిల్లా, జూలై 29:** ములుగు జిల్లా, వాజేడు మండలం, చీకుపల్లి గ్రామంలోని బోగత జలపాతానికి పర్యాటకుల ప్రవేశాన్ని అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జలపాతంలో ప్రమాదకర స్థాయిలో నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రజలు, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.